క్లుప్తంగా

నేడు ఉపమాక వెంకన్న పెళ్లిరాట

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలకు సంబంధించి ఆదివారం పెళ్లి రాట వేయనున్నట్టు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం మాఘ బహుళ పాడ్యమి,పుబ్బనక్షత్రయుక్త మేషలగ్నమందు ముహూర్తం అనుసరించి 10.14గంటలకు ధ్వజస్తంభం ఉన్న ప్రాంగణంలో పెళ్లి రాట వేయనున్నట్టు చెప్పారు. స్వామివారి కల్యాణోత్సవాలు వచ్చేనెల 20న ఘనంగా ప్రారంభం కానున్నాయి.26వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో జరిగే ఈ కల్యాణోత్సవాలకు వచ్చే మార్చి 19 న అంకురార్పణ జరుగుతుందని తెలిపారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన


తిమ్మరాజుపేటలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట, మూలపేట ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో రెవెన్యూ అధికారులు శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈవీఎంల వినియోగంపై ఆర్ఐ కిషోర్‌కుమార్ అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానం, పోలింగ్ కేంద్రాల్లో కల్పించే సదుపాయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ విభాగం మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్, పలువురు ఓటర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి


జిల్లా ఎన్నికల అధికారి దయానిధికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఎస్.రాయవరం: ఎన్నికల విధుల నుంచి 55 సంవత్సరాల పైబడిన ఉపాధ్యాయులను, గర్భిణులు, దివ్యాంగ ఉపాధ్యాయులను మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు కోరారు. ఈమేరకు శనివారం ఎన్నికల అధికారి దయానిధికి వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బిల్లులను త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఖజానా అధికారికి.. ధర్మారావు మరో వినతి పత్రం అందజేశారు.

డస్ట్ బిన్ల పంపిణీ


డస్ట్ బిన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పాయకరావుపేట: పట్టణంలోని కంటోన్మెంట్ ఏరియా వాసులకు శనివారం డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు డస్ట్‌బిన్లను సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ పంపిణీ చేశారు. పంచాయతీ వార్డు సభ్యులు పెంకే గోవిందు, ముక్కుడుపల్లి దాసు, జగతా శ్రీను, పల్లా ప్రసాద్, పెదిరెడ్డి పద్మ,తుమ్మలపల్లి సతీష్, లావేటి సన్యాసిరావు, దేవాదుల మంగ, గ్రామ పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వినాయక విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు


నక్కపల్లిలో నిర్మించిన వినాయక ఆలయం

నక్కపల్లి: స్థానిక వీవర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన వినాయక ఆలయలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించనునన్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 27 వతేదీ ఉదయం 11గంటలకు సిద్ధి,బుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం జరుగుతుందని చెప్పారు.

పున్నమి స్నానం..పులకించిన జన సంద్రం

- భక్తి శ్రద్ధలతో మాఘపౌర్ణమి స్నానాలు
- కిటకిటలాడిన తీర ప్రాంతాలు


రాజవరం తీరంలో పోలీసుల బందోబస్తు


మజ్జిగ పంపిణీ చేస్తున్న చిక్కాల రామారావు యూత్ సభ్యులు


బోయపాడులో సముద్రస్నానమాచరిస్తున్న భక్తులు


పాల్మన్‌పేట తీరంలో స్నానాలు చేస్తున్న భక్తులు

పాయకరావుపేట : మాఘపౌర్ణమి సందర్భంగా సముద్ర తీరాలకు జనం పోటెత్తారు. పుణ్యస్నానాలు ఆచరించి, భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పులకించిపోయారు. పాయకరావుపేట మండలంలోని పెంటకోట, రాజవరం, పాల్మన్‌పేట, వెంకటనగరం తీర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు చేశారు. తుని, పాయకరావుపేట, కోటనందురూ తదితర మండలాలకు చెందిన భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెంటకోట మెరైన్ పోలీసు సిబ్బంది, పాయకరావుపేట పోలీసు స్టేషన్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నక్కపల్లి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మండలంలో రాజయ్యపేట, బోయపాడు, చందనాడ సముద్రతీరాలకు భక్తులు పోటెత్తారు. పుణ్యస్నానాలు చేసేందుకు వివిధ గ్రామాలనుంచి తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వచ్ఛంద సేవలు

ఎస్.రాయవరం/పాయకరావుపేట: పుణ్యస్నానాలు చేసేందుకు సముద్రతీరాలకు వచ్చిన భక్తులకు సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు సత్యసాయి సేవా సంస్థలు, పలు యువజన సంఘాలు పోటీపడ్డాయి. తాగునీరు,మజ్జిగతో పాటు పలు చోట్ల అల్పాహారం అందించాయి. ఎస్.రాయవరం మండల పరిషత్ సిబ్బంది తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. పాయకరావుపేట మండలం పెంటకోట తీరంలో . జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో చిక్కాల యూత్ సభ్యులు మజ్జిగ పంపిణీ చేసి, భక్తుల దాహార్తిని తీర్చారు. ఎస్.రాయవరం తహసీల్దార్ నేరుగా జాతర భక్తులకు ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో నక్కపల్లి సీఐ అప్పన్న బందోబస్తు నిర్వహించారు.అడ్డురోడ్డు నుంచి కొరుప్రోలు, గుర్రాజుపేట గుడివాడ, పెద ఉప్పలం,రేవుపోలవరం తదితర జంక్షన్‌ల వద్ద సిబ్బందిని ఉంచి బందోబస్తు నిర్వహించారు.తీరంలో భక్తులు స్నానాలు ఆచరించే వద్ద గజఈతగాళ్లను ఏర్పాటు చేశారు.దీంతో ప్రశాంతంగా మాఘపౌర్ణమి పుణ్య స్నానాలు ముగిశాయి.


జాతరలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్యసాయిసేవాసంఘం సభ్యులు


లక్ష్మీ మాధవ స్వామి ఆలయం వద్ద భక్తుల కోలాహలం


రాంబిల్లి మండలం వాడపాలెంలో తీరం వద్ద భక్తజన సందోహం

సిద్ధం సభకు ఏర్పాట్లు పూర్తి


విలేకర్లతో మాట్లాడుతున్న బొలిశెట్టి గోవిందరావు


సమావేశం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాజు, వైస్ ఎంపీపీ సీతారామరాజు

ఎస్.రాయవరం:పాయకరావుపేట నియోజవర్గంలో ఈ నెల 26న నిర్వహించే సిద్ధం సభకు అడ్డురోడ్డులో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. మండల కేంద్రం ఎస్.రాయవరంలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఈ సభకు హాజరవుతారని చెప్పారు. అడ్డురోడ్డు సమీపంలోని రేవుపోలవరం రోడ్డులో సభావేదిక సిద్ధం చేసినట్టు చెప్పారు.ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ భూపతి అప్పారావు,ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు యల్లపు నాగు, బైపా గడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయాలి

కోటవురట్ల: ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో ఈ నెల 26న జరగనున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయిలో జరిగే సిద్ధం సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ సభలో రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి పాల్గొంటారని తెలిపారు. భారీ ఎత్తున కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

లైంగిక నేరాల కట్టడికి కఠిన చట్టాలు

- ట్రైనీ డీఎస్పీ భవ్యరెడ్డి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ భవ్యరెడ్డి

యలమంచిలి రూరల్: లైంగిక వేధింపులు, లైంగిక నేరాల కట్టడికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమలు చేస్తున్నాయని ట్రైనీ డీఎస్పీ జి.భవ్యరెడ్డి చెప్పారు. కొక్కిరాపల్లి అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థినులకు ఆమె పోక్సో చట్టం,బాల్యవివాహాల నిరోధక చట్టం, సమాజంలో చిన్నారులపై జరుగుతున్న పలు అఘాయిత్యాలపై శనివారం అవగాహన కల్పించారు. చిన్నారులపై లైంగిక నేరాల కట్టడి కోసం 2012లో అమలులోకి తెచ్చిన పోక్సో చట్టం గురించి సమగ్రంగా వివరించారు.చిన్నారులపై అఘాయిత్యాలు జరిగినపుడు చట్టప్రకారం నిందితులకు ఎలాంటి శిక్షలు విధిస్తారో,బాధితులకు ప్రభుత్వం ఎలా అండగా ఉంటుందో తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు వివరించారు. ప్రభుత్వాలు బాలికా విద్యకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తున్నాయని, దానిని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుకునే వయసులోనే ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, వాటిని చేరుకునేందుకు అహర్నిశలూ శ్రమించాలని చెప్పారు. కొందరు విద్యార్థినులతో భవిష్యత్తుపై వారికున్న అభిప్రాయాలను చెప్పించారు. విద్యార్థినులకు మంచి సందేశం ఇచ్చిన ట్రైనీ డీఎస్పీ భవ్యరెడ్డిని గురుకులం ప్రిన్సిపాల్ మాణిక్యం,సిబ్బంది సత్కరించారు.ఈ కార్యక్రమంలో యలమంచిలి రూరల్ ఎస్ఐ పైల సింహాచలం,సంగీతం ఉపాధ్యాయురాలు హరిణి తదితరులు పాల్గొన్నారు.

పంచదార్లలో కంకర దందా

- రాత్రి వేళల్లో దర్జాగా అక్రమ తవ్వకాలు
- టీడీపీ నేతల కనుసన్నల్లోనే తరలింపు
- అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు


పంచదార్ల వద్ద కంకర తవ్వకాలు జరిపిన ప్రదేశం

రాంబిల్లి: పంచదార్ల వద్ద కంకర దందా దర్జాగా సాగిపోతోంది. మండల స్థాయి టీడీపీ నాయకుడు కనుసన్నల్లోనే దర్జాగా కంకర తవ్వకాలు సాగిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం రాత్రి జేసీబీ సాయంతో కంకర తవ్వి పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో కంకర తరలిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చందకరాజు అడ్డుకున్నారు. డి.పట్టా స్థలాల్లో దర్జాగా కంకర తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని రాజు ఆవేదన వ్యక్తం చేశారు. తాను అడ్డుకోవడానికి వెళ్లినపుడు తనపై మద్యం మత్తులో టీడీపీకి చెందిన పలువురు గొడవకు దిగినట్లు రాజు తెలిపారు. కంకర తవ్వకాలపై పోలీసులకు సమాచారం ఇచ్చానని, అయితే ఇది రెవెన్యూ అధికారులకు తప్ప పోలీసులకు సంబంధం లేదని చెప్పారన్నారు. దీంతో తహసీల్దార్ అప్పలస్వామి, ఆర్డీవో చిన్నికృష్ణలకు సమాచారం ఇవ్వడంతో కంకర తవ్వకాలను అర్ధరాత్రి సమయంలో ఆపేశారన్నారు. ప్రభుత్వం నుంచి ఏ అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించకుండా కంకర తవ్వకాలు జరుపుతున్నారని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

లక్ష్మీమాధవి స్వామిని దర్శించుకున్న గొల్ల బాబూరావు


రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును సత్కరిస్తున్న సమతాసైనిక్ దళ్ సభ్యులు

ఎస్.రాయవరం: రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికై తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన గొల్ల బాబూరావు రేవుపోలవరం తీరంలో శ్రీ లక్ష్మీమాధవ స్వామిని దర్శించుకున్నారు.శనివారం కొరుప్రోలు క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ఆయనకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా లక్ష్మీమాధవ స్వామిని దర్శించుకున్నారు. బాబూరావుకు అర్చకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీపతిరాజు, అచ్యుత్‌రామరాజు, పేరిచర్ల వెంకటేశ్వరరాజు, శ్రీరామ్మూర్తిరాజు, సీతారామరాజు, పత్సమట్ల బాపిరాజు, రేవుపోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘన సత్కారం

రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన గొల్ల బాబూరావును పాయకరావుపేట సమత సైనిక్‌దళ్ సభ్యులు కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ సభ్యులు గారా ప్రకాష్, పి.అప్పారావు, ఐసరపు నాగరాజు, దండా సూకేష్, లోవరాజు, గోపాలకృష్ణ, గారా చంటి జల్లూరి కృష్ణ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే లక్ష్యం


కోటవురట్ల కుమ్మరివీధి జగనన్న కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోటవురట్ల: ప్రతి కుటుంబానికి సొంతిల్లు సమకూర్చాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు అన్నారు. స్థానిక కుమ్మరి వీధి జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. లబ్ధిదారులను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పేదలకు సొంతగూడు ఏర్పరించేందుకు ఆర్థిక సాయం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కేశవస్వామి నాగవల్లి వసంతోత్సవం


కేశవస్వామివారి నాగవల్లి వసంతోత్సవం చేస్తున్న అర్చకులు


హోమం చేస్తున్న వేదపడితులు

చోడవరం: కేశవస్వామివారి కల్యాణోత్సవాల్లో స్వామివారికి నాగవల్లి వసంతోత్సవం కన్నుల పండువగా శనివారం జరిగింది. చోడవరంలో శ్రీదేవి భూదేవి సమేతుడైన కేశవస్వామివారి 751వ వార్షిక బ్రహోత్సవాలు ఐదు రోజులుగా జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణంలో భాగంగా నాగవల్లి వసంతోత్సవంలో శ్రీచక్రస్నానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్చరణ మధ్య స్వామివారి వసంతోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచీ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి కేశవస్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉంచి వసంతోత్సవం నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, మహా పూర్ణాహుతి జరిపించారు. సాయంత్రం అన్నమాచార్య పురందరదాస సంకీర్తనాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణమూర్తి, ట్రస్టు బోర్డు చైర్మన్ అలమండ ఈశ్వరరావు, మాజీ చైర్మన్ ఉప్పలబాబు పాల్గొన్నారు.

వేడుకగా గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

నాతవరం: తాండవ ప్రాజెక్టు దిగువనున్న నల్లకొండమ్మ తల్లి ప్రాంగణంలో శనివారం గిరి ప్రదక్షిణను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ప్రాంతీయులు ఏ పనీ తలపెట్టిన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రారంభిస్తే అవలీలగా పూర్తవుతుందన్న అపార నమ్మకం. దీంతో కొంత కాలంగా ఏటా ఫిబ్రవరిలో గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. ఈ ఏడాదీ మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు శనివారం ఉదయం 9 గంటల నుంచి తాండవ, ఆడాకులు, తాండవ ప్రాజెక్టు స్పిల్ వే గేట్లు, జాలారిపేట గ్రామం మీదుగా గిరి ప్రదక్షిణ చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళల కోలాటం, భజనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గిరి ప్రదక్షిణలు చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు తోటాడలో ఉచిత వైద్య శిబిరం

మునగపాక: మండలంలోని తోటాడలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖడెయిరీ పాలకేంద్రం ఆవరణలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్,చిన్న పిల్లల వైద్య నిపుణులు సీహెచ్ సందీప్ ఆనంద్‌లు సేవలందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

3న సీతారామచంద్రమూర్తి ఆలయ వార్షికోత్సవం

మునగపాక:మండలంలోని గవర్ల అనకాపల్లిలో వచ్చేనెల 3వ తేదీన కోదండ సీతారామచంద్రమూర్తి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ కాండ్రేగుల సూర్యనారాయణ తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు.

26న అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

27న మోదకొండమ్మ తీర్థం



మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థం ఈ నెల 27న జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు శనివారం తెలిపారు. ఈ తీర్థాన్ని వైభవంగా నిర్వహించడానికి భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ మెంబరు దంగేటి సూర్యారావు, సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం


దుర్గాలమ్మ అమ్మవారు

బుచ్చెయ్యపేట: నీలకంఠాపురంలో నూతనంగా నిర్మించిన దుర్గాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, కలశస్థాపన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులతోపాటు పలువురి దాతల విరాళాలతో గ్రామ శివారులో లక్షలాది రూపాయ లతో కొత్తగా అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఇందులో భాగంగా ప్రతిష్ఠ కార్యక్రమాలను ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, పలువురు నాయకులు హాజరు కానున్నారని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సర్పంచ్ పడాల నాగభూషణం, వైస్ సర్పంచ్ పడాల వెంకటరమణ గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

'ఉపాధి' అక్రమాల్లో రూ.12,500 రికవరీకి ఆదేశం


మాట్లాడుతున్న ఉపాధి ఏపీడీ రోజారాణి

నాతవరం: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే అధికారుల నుంచి రికవరీ చేస్తామని సంబంధిత అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టరు ఎం.రోజారాణి హెచ్చరించారు. మండల వ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు 15 కోట్లు 55 లక్షల 44 వేల 550 రూపాయలతో చేసిన 1,068 పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు చేశారు. వీటిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సామాజిక తనిఖీ ప్రజా వేదిక 16వ రౌండు అవుతుందన్నారు. ఇంతవరకు నిర్వహించిన 22 మండలాలతో పోల్చుకుంటే, నాతవరం మండలంలో క్షేత్రస్థాయి పరిశీలనలో పెద్దగా అక్రమాలు జరగలేదన్నారు. రూ.12,500 రికవరీకి ఆదేశించామన్నారు. పలు పంచాయతీల్లో పనులు చేసి రికార్డులు నమోదు చేయడంలో జాప్యం కారణంగా చిన్నపాటి పొరపాట్లు దొర్లాయన్నారు. గతంతో పోల్చుకుంటే ఉపాధి సిబ్బంది బాధ్యతాయుతంగా పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్సు అధికారి నిర్మలాదేవి, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో జాగరపు రాంబాబు, వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, ఏపీవో చిన్నారావు, డీఆర్పీ బి.సూర్యనారాయణ, గునుపూడి, మాధవనగరం సర్పంచులు వేముల సూర్యనారాయణ, సోమల చింతల్లి, గునుపూడి ఎంపీటీసీ సభ్యుడు పోలుపర్తి వెంకటరమణ, ఈసీ దేముడు, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ట

మాకవరపాలెం: సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. తామరంలో ఇటీవల నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సాగిన ఈ కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. ఆలయ కమి టీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.